క్లుప్తంగా

ఘనంగా పోచమ్మ బోనాలు



బోనాల ఊరేగింపులో గ్రామస్తులు

చిన్నకోడూరు(సిద్దిపేట): మండల పరిధిలోని అల్లీపూర్‌లో గురువారం కురుమ సంఘం ఆధ్వర్యంలో పోచమ్మ బోనాలు ఘనంగా నిర్వహించారు. బీరప్ప ఆలయం వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు. వర్షాలు సంమృద్ధిగా కురిసి పంటలు బాగా పండాలని, ప్రజలు సుభిక్షంగా ఉండాలని వేడుకున్నారు.

ఓటరు జాబితాను జాగ్రత్తగా సరిచూడాలి



బీఎల్‌ఓలకు సూచనలు చేస్తున్న తహసీల్దార్ గయాస్ ఉన్నీసా బేగం

హుస్నాబాద్‌రూరల్: సార్వత్రిక ఎన్నికల కోసం బీఎల్‌ఓలు ఇంటింటికీ తిరిగి ఓటరు జాబితాలోని తప్పులను సరిచేస్తున్నారు. గురువారం మండలంలోని నాగారం గ్రామంలో ఓటరు జాబితాల సవరణ కార్యక్రమాన్ని తహసీల్దార్ గయాస్ ఉన్నీసా బేగం పరిశీలించారు. ఈ సందర్భంగా బీఎల్‌ఓలకు ఓటరు జాబితాల సవరణలో తగు సూచనలు చేశారు. గ్రామాల్లోని ప్రతి ఇంటికి తిరుగుతూ ఓటరు జాబితాలను జాగ్రత్తగా సరిచేయాలని చెప్పారు. మూడురోజుల్లో ఓటరు జాబితా సవరణను పూర్తి చేయాలని సూచించారు. వీరి వెంట రెవెన్యూ సిబ్బంది, బీఎల్‌ఓలు ఉన్నారు.

వార్డు అభివృద్ధే లక్ష్యం

దుబ్బాక: వార్డు అభివృద్ధే లక్ష్యంగా పని చేస్తామని కౌన్సిలర్ ఆస యాదగిరి అన్నారు. పట్టణంలోని 14వ వార్డులో జరుగుతున్న మురికి కాల్వల నిర్మాణ పనులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎంపీ కొత్త ప్రభాకర్‌రెడ్డి సహకారంతో రూ.30లక్షల నిధులతో వార్డులో సమస్యాత్మకంగా ఉన్న మురికి కాల్వల నిర్మాణ పనులను చేపడుతున్నామన్నారు. వర్షాకాలం నేపథ్యంలో వార్డులో ఏమైనా సమస్యలు ఉంటే ప్రజలు వెంటనే తన దృష్టికి తీసుకురావాలన్నారు.

డాక్టర్ శ్యాం ప్రసాద్ ముఖర్జీకి నివాళి



నివాళులర్పిస్తున్న నాయకులు

దుబ్బాక: దేశ ప్రజలు, నమ్మిన సిద్ధాంతం కోసం శ్రమించిన మహోన్నత వ్యక్తి డాక్టర్ శ్యాం ప్రసాద్ ముఖర్జీ అని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు అంబటి బాలేశ్‌గౌడ్ కొనియాడారు. జన సంఘ్ వ్యవస్థాపకుడు డాక్టర్ శ్యాం ప్రసాద్ ముఖర్జీ జయంతిని పురస్కరించుకొని గురువారం పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూల మాల వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో నాయకులు సుభాశ్‌రెడ్డి, వెంకట్‌గౌడ్, ప్రవీణ్ కుమార్, రమణారెడ్డి, తొగుట రవీందర్, సప్తగిరి తదితరులున్నారు.

బాధితుడిని ఆదుకోవాలి

చేర్యాల(సిద్దిపేట): బుధవారం ఉదయం కురిసిన వర్షానికి మండల పరిధిలోని కాశగుడిసెలు గ్రామానికి చెందిన షేక్ షరీఫ్ పూరి గుడిసె నేలమట్టమైంది. గురువారం బాధిత కుటుంబాన్ని పరామర్శించిన సర్పంచ్ షేక్ ఫకీర్ మాట్లాడుతూ.. దివ్యాంగుడైన షరీఫ్ గుడిసె కూలిపోవడంతో గుడిసెలోని వంట సామగ్రి, 50 కిలోల బియ్యం, పాడైపోయాయన్నారు. నష్టపోయిన బాధితుడిని ప్రభుత్వం ఆదుకోవాలని, డబుల్ బెడ్రూం ఇళ్ల ఇవ్వాలని కోరారు.

వరినారుతో పుట్టినరోజు శుభాకాంక్షలు



నారుమడి వద్ద జన్మదిన శుభాకాంక్షలు తెలుపుతున్న కాంగ్రెస్ నాయకులు

నంగునూరు(సిద్దిపేట): సంగారెడ్డి ఎమ్మెల్యే తూర్పు జయప్రకాశ్‌రెడ్డి కూతురు జయారెడ్డి జన్మదినం పురస్కరించుకొని నంగునూరుకు చెందిన రైతు, కాంగ్రెస్ పార్టీ నాయకుడు చెలికాని యాదగిరి వరినారుతో పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపాడు. తన పొలంలో వేసిన నారును జగ్గన్నకు జయారెడ్డికి జన్మదిన శుభాకాంక్షలు అనే పేరుతో కత్తిరించి తన అభిమానాన్ని చాటుకున్నాడు.

సమస్యలు పరిష్కరించే వరకు పోరాటం

సమ్మెలో జీపీ కార్మికులు



చేర్యాల(సిద్దిపేట): సమ్మెకు సంఘీభావం తెలుపుతున్న వెంకట్‌మావో తదితరులు

చేర్యాల(సిద్దిపేట): తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ రాష్ట్ర వ్యాప్తంగా అన్ని గ్రామాల్లో పంచాయతీ కార్మికులు గురువారం ఎంపీడీఓ కార్యాలయాల ఎదుట నిరవధిక సమ్మె చేపట్టారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. జీవో నంబర్ 60 ప్రకారం పంచాయతీ సిబ్బందికి కేటగిరీల వారీగా వేతనాలు రూ.15,500ల నుంచి రూ.19,500ల వరకు పెంచాలన్నారు. ఏదైనా ప్రమాదంలో మరణించిన కార్మికుడి కుటుంబానికి ప్రభుత్వమే రూ.10లక్షల నష్టపరిహారం ఇవ్వాలన్నారు. కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన 4 లేబర్ కోడ్‌లను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. జీఓ 51ని సవరించి, మల్టీపర్పస్ వర్కర్ విధానాన్ని రద్దు చేయాలన్నారు. ప్రభుత్వం స్పందించి తమ డిమాండ్లను అమలు చేసేవరకు సమ్మె కొనసాగిస్తామని డిమాండ్ చేశారు. చేర్యాలలో చేపట్టిన సమ్మెకు వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు కొంగరి వెంకట్‌మావో సంఘీభావం తెలిపారు. కార్యక్రమంలో కార్మిక సంఘం మండల నాయకులు మనోజ్‌కుమార్, సాయి, కరుణాకర్, రమేశ్, కార్మికులు పాల్గొన్నారు.

సిద్దిపేటజోన్: గ్రామ పంచాయతీ కార్మికుల సమస్యలను పరిష్కరించి వారికి న్యాయం చేయాలని కార్మిక సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. గురువారం పట్టణంలోని బ్లాక్ ఆఫీస్ వద్ద గ్రామ పంచాయతీ కార్మికుల సమ్మె శిబిరాన్ని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి లక్ష్మణ్, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి శశిధర్‌లు సందర్శించి సంఘీభావం ప్రకటించారు. కార్యక్రమంలో వివిధ గ్రామాల కార్మికులు పాల్గొన్నారు. సమ్మెకు పలు కార్మిక అనుబంధ సంఘాల ప్రతినిధులు మద్దతు పలికారు.

అక్కన్నపేట(హుస్నాబాద్): అక్కన్నపేట ఎంపీడీఓ కార్యాలయం ఎదుట పంచాయతీ కార్మికులు చేపట్టిన సమ్మెలో కారోబార్, పంచాయతీ సిబ్బంది మండల కమిటీ అధ్యక్షుడు సాయన్న, ప్రధాన



దౌల్తాబాద్‌లో..

కార్యదర్శి బండారి రాజేశం, గౌరవ అధ్యక్షుడు పిట్టల ఆశయ్య, సర్పంచ్ ముత్యాల సంజీవ్‌రెడ్డి, కార్మికులు పాల్గొన్నారు.

తొగుట(దుబ్బాక): తొగుటలో ఎంపీడీఓ శ్రీధర్‌కు గురువారం కార్మికులు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా గ్రామ పంచాయతీ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి తునికి మహేశ్ మాట్లాడుతూ.. ప్రభుత్వం స్పందించి కార్మికుల సమస్యలు పరిష్కరించకుంటే ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని ఆయన హెచ్చరించారు. కార్యక్రమంలో యూనియన్ కార్యదర్శి యాదగిరి,కార్మికులు పాల్గొన్నారు.

కనీస వేతనాలు అమలు చేయాలి

జగదేవ్‌పూర్(గజ్వేల్): కార్మికులకు కనీస వేతనాలు అమలు చేయాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఎల్లయ్య అన్నారు. గురువారం మండల కార్యాలయం ఎదుట కార్మికులు సమ్మెకు దిగారు.



సిద్దిపేటజోన్: సమ్మె శిబిరంలో కార్మికులు

దుబ్బాకరూరల్: కార్మికులను రెగ్యులరైజ్ చేయాలని కోరుతూ సీఐటీయూ ఆధ్వర్యంలో ఎంపీపీ కార్యాలయం ఎదుట సమ్మె చేపట్టారు. కార్యక్రమంలో సీఐటీయూ మండల నాయకులు సాధిక్, ప్రశాంత్, శ్రీను, రవి, శ్రీకాంత్, దుర్గవ్వ, ఎల్లవ్వ తదితరులు పాల్గొన్నారు.

కొండపాక(గజ్వేల్): మల్టీపర్పస్ విధానాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ సీఐటీయూ ఆధ్వర్యంలో గురువారం కొండపాక ఎంపీడీఓ కార్యాయం వద్ద సమ్మెను ప్రారంభించారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యులు అమ్ముల బాల్ నర్సయ్య మాట్లాడుతూ.. కార్మికుల సమస్యలను పరిష్కరించడంలో ప్రభుత్వం విఫలమైందన్నారు. కార్యక్రమంలో నాయకులు నర్సింలు, ప్రభాకర్, నర్సింలు, మల్లేశం, భాగ్యలక్ష్మి, సాయికుమార్, భిక్షపతి, కిష్టయ్య, సుధాకర్, రాజు పాల్గొన్నారు.



అక్కన్నపేటలో..



జగదేవ్‌పూర్‌లో..



నంగునూరులో..

కార్యకర్తలు అంకితభావంతో పనిచేయాలి



రవికి నియామకపత్రం అందిస్తున్న శ్రీనివాస్‌రెడ్డి

దుబ్బాక: వచ్చే ఎన్నికల్లో దుబ్బాకలో కాంగ్రెస్ పార్టీ గెలుపొందడానికి ప్రతీ కార్యకర్త అంకితభావంతో పని చేయాలని దుబ్బాక నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. దుబ్బాక మండల కాంగ్రెస్ అధ్యక్షుడిగా నియామకమైనా మండల పరిధిలోని బల్వంతాపూర్ గ్రామానికి చెందిన కొంగరి రవికి గురువారం దుబ్బాక కాంగ్రెస్ కార్యాలయంలో ఆయన నియామకపత్రం అందించారు.

మిరుదొడ్డి(దుబ్బాక): మిరుదొడ్డి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడిగా మద్దెల రాజేశ్(మిరుదొడ్డి) నియామకమయ్యారు. మండల ఉపాధ్యక్షుడిగా ఎండీ.అర్షద్ బిగ్, ట్రెజరర్‌గా సారంగ సురేశ్, జనరల్ సెక్రటరీలుగా అగురం కనకారెడ్డి, బీడ ఎల్లం, పూడూరి మహేశ్, కార్యవర్గ సభ్యులుగా అశోక్, కరుణాకర్, మహేందర్‌రెడ్డి, కన్నారెడ్డి, రాజు, రామకృష్ణ, సుదర్శన్, అర్షద్, బాలకిషన్, నవాజుద్దీన్, లక్ష్మీనారాయణ, బాల్‌రాజు, మధు, నర్సింలు, రాజశేఖర్, మహేశ్, రాజు, ప్రభాకర్‌గౌడ్, స్వామిలు నియామకమయ్యారు. మండల కమిటీని స్వాగతిస్తూ కాంగ్రెస్ సీనియర్ నాయకులు నేరండ్ల భూమాగౌడ్ నేతృత్వంలో గురువారం మిరుదొడ్డిలో సంబరాలు జరుపుకున్నారు.

తొగుటలో..

తొగుట(దుబ్బాక): మండలంలోని ఘనపురంకు చెందిన అక్కం స్వామి మండల అధ్యక్షుడిగా నియామకమయ్యారు. ఈ మేరకు దుబ్బాక నియోజకవర్గ ఇన్‌చార్జి చెరుకు శ్రీనివాస్‌రెడ్డి గురువారం నియామకపత్రం అందజేశారు.

రాయపోలు(దుబ్బాక): దౌల్తాబాద్ మండల అధ్యక్షుడిగా తిర్మలాపూర్‌కు చెందిన పడాల రాములు, రాయపోలు మండల అధ్యక్షుడిగా వడ్డేపల్లికి చెందిన తుప్పటి సుధాకర్‌లను నియమించారు. ఈ మేరకు గురువారం వారికి దుబ్బాక నియోజకవర్గ ఇన్‌చార్జి శ్రీనివాస్‌రెడ్డి నియామకపత్రాలు అందజేశారు.

ఇంటింటికీ వెళ్లి వివరాలు సేకరించాలి

ఆర్డీఓ బెన్ సాలమ్



బీఎల్‌ఓల సమావేశంలో మాట్లాడుతున్న ఆర్డీఓ బెన్ సాలమ్

హుస్నాబాద్: మున్సిపల్ సమావేశ మందిరంలో ఎన్నికల నిబంధనలపై బూత్ లెవల్ ఆఫీసర్లతో గురువారం ఆర్డీఓ బెన్ సాలమ్ అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్డీఓ బెన్ సాలమ్ మాట్లాడుతూ.. ఎన్నికల నిబంధనలపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలన్నారు. ఫామ్ 6 ద్వారా కొత్త ఓటర్ల నమోదు, ఫామ్ 7 ద్వారా మృతి చెందిన వారిని తొలగించడం, ఒక ఇంటి నుంచి మరో ఇంటికి మారే ఓటర్లను నమోదు చేయాలన్నారు. అదేవిధంగా ఒక ఇంటిలో 12 మంది సభ్యులు ఉంటే అందులో 6గురు ఓటర్లకు ఒక ఇంటి నంబర్, మరో 6గురు ఓటర్లకు ఇంటి బై నంబర్ వేయాలని సూచించారు. ఇంటి బై నంబర్ ఎన్నికల వరకే ఉంటుందన్నారు. బీఎల్ఓలు ఇంటింటికీ తిరిగి ప్రతి ఓటర్ వివరాలను సేకరించాలన్నారు. సమావేశంలో మున్సిపల్ కమిషనర్ రాజమల్లయ్య, ఏఈ సాయిప్రణీత్, ఆర్ఐ కృష్ణ తదితరులు ఉన్నారు.

బహిరంగ సభను జయప్రదం చేయండి



మాట్లాడుతున్న సురేశ్‌గౌడ్

చేర్యాల(సిద్దిపేట): ఈ నెల 8వ తేదీన హన్మకొండ ఆర్ట్స్ కాలేజీ మైదానంలో బీజేపీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న బహిరంగ సభకు అధిక సంఖ్యలో నాయకులు, కార్యకర్తలు హాజరై విజయవంతం చేయాలని బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి బూరుగు సురేశ్‌గౌడ్ పిలుపునిచ్చారు. గురువారం పట్టణంలోని కార్యాలయంలో చేర్యాల పట్టణ, రూరల్, కొమురవెల్లి, మద్దూరు, దూళ్మిట్ట మండలాల అధ్యక్షులతో ఏర్పాటు చేసిన సమావేశంలో సురేశ్ మాట్లాడుతూ.. కేంద్రంలో నరేంద్ర మోదీ ప్రభుత్వం ఏర్పాటై 9 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా వరంగల్‌లో నిర్వహిస్తున్న బహిరంగ సభకు నాలుగు మండలాల నుంచి నాయకులు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో నాయకులు లక్ష్మారెడ్డి, శశిధర్‌రెడ్డి, రాందాసు, సురేందర్, పాండు, భాస్కర్‌రెడ్డి, భిక్షపతినాయక్, బాల్‌రాజు, సంజీవులు, వెంకటేశ్, శ్రీనివాస్‌రెడ్డి, రాజు తదితరులు పాల్గొన్నారు.

పరిశ్రమల ఏర్పాటుకు ప్రజాభిప్రాయ సేకరణ



మందాపూర్‌లో గ్రామస్తులతో మాట్లాడుతున్న అధికారులు

జగదేవ్‌పూర్(గజ్వేల్): పరిశ్రమల ఏర్పాటుకు మేమంతా అనుకూలంగా ఉన్నట్లు మునిగడప రెవెన్యూ గ్రామాలు మందాపూర్, పలుగుగడ్డ రైతులు తెలిపినట్లు తహసీల్దార్ రఘువీరారెడ్డి తెలిపారు. గురువారం మందాపూర్‌లో మూడు గ్రామాల రైతులతో సమావేశం ఏర్పాటు చేశారు. మునిగడప రెవెన్యూ గ్రామ పరిధిలోని 445 సర్వే నంబర్‌లోని 412 ఎకరాల అసైన్డ్ భూముల్లో టీఎస్ఐఐసీ ఆధ్వర్యంలో కంపెనీలు ఏర్పాటు చేయడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉండడంతో తహసీల్దార్ గురువారం ఆయా గ్రామాల ప్రజల ప్రజాభిసేకరణ చేపట్టారు. జిల్లా అధికారుల దృష్టికి తీసుకెళ్లి మరోసారి సమావేశం ఏర్పాటు చేయనున్నట్లు అధికారులు తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు రాజేశ్వరిరవి, భిక్షపతి, బాలలక్ష్మీఐలయ్య, ఆర్ఐ నాగరాజు పాల్గొన్నారు.

నిధులు మంజూరు చేయాలి



మంత్రి హరీశ్‌రావుకు వినతిపత్రం అందిస్తున్న సర్పంచ్ కిరణ్‌కుమార్‌చారి

కొండపాక(గజ్వేల్): కుకునూరుపల్లి మండలంలోని మంగోల్ గ్రామంలో వివిధ కుల సంఘాల భవనాల నిర్మాణాలకు నిధులు మంజూరు చేయాలని సర్పంచ్ పుల్లోజు కిరణ్‌కుమార్‌చారి మంత్రి హరీశ్ రావును కోరారు. అదేవిధంగా మల్లన్నసాగర్ నుంచి తపాస్‌పల్లి రిజర్వాయర్‌లోకి వెళ్లే కాల్వ నిర్మాణాల్లో కోల్పోతున్న భూములకు నష్టపరిహారం వచ్చేలా చూడాలని మేదినీపూర్ మాజీ సర్పంచ్ భర్త విరుపాక రమేశ్‌రెడ్డిలతో పాటు రైతులు గురువారం మంత్రి హరీశ్‌రావును కలిసి వినతిపత్రం అందించి కోరారు. స్పందించిన మంత్రి హరీశ్‌రావు నిధుల విషయమై ప్రతిపాదనలు తయారు చేయాలని పంచాయతీరాజ్ శాఖ అధికారులకు ఫోన్ ద్వారా సూచించారు. కాల్వ నిర్మాణాల్లో కోల్పోతున్న భూములకు నష్టపరిహారం త్వరలో అందేలా చూస్తామంటూ రైతులకు భరోసానిచ్చారు. కార్యక్రమంలో రైతులు పాల్గొన్నారు.

శిథిలావస్థకు చేరిన ఇళ్లు ఖాళీ చేయండి

సిద్దిపేటజోన్: వర్షాకాల నేపథ్యంలో పట్టణంలో ఉన్న పురాతన, శిథిలావస్థకు చేరిన ఇళ్లల్లో నివసిస్తున్న వారు వెంటనే వాటిని ఖాళీ చేయాలని మున్సిపల్ కమిషనర్ సంపత్ గురువారం పత్రికా ముఖంగా ప్రజలకు సూచించారు. ప్రజలు ముందు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. అపార్ట్‌మెంట్‌లలో సెల్లార్లలో వర్షం నీరు నిలిచే ప్రమాదం ఉందని, సెల్లార్‌లోని విద్యుత్ ప్యానల్ బోర్డును మొదటి, రెండో ఫ్లోర్‌కు మార్చుకోవాలని సూచించారు. ఇప్పటికే పట్టణంలో ఉన్న పలు అపార్ట్‌మెంట్‌లకు మున్సిపల్ అధికారులు నోటీసులు జారీ చేసినట్టు పేర్కొన్నారు. పట్టణంలో శిథిలావస్థకు చేరిన ఇళ్లను గుర్తించి, వారికి నోటీసులు కూడా ఇచ్చామని సూచించారు.

దర్గపల్లి వద్ద రోడ్డు మూసివేత



దర్గపల్లి వద్ద రోడ్డును మూసివేసిన గ్రామస్తులు

నంగునూరు(సిద్దిపేట): మండపల్లి నుంచి పారే వాగునీరు దర్గపల్లి వద్ద నిర్మిస్తున్న బిడ్జి కింది నుంచి ప్రవహించడంతో మట్టి రోడ్డు కొట్టుకొనిపోగా గ్రామస్తులు రోడ్డును మూసివేశారు. దీంతో సికింద్లాపూర్ నుంచి కరీంనగర్ వెళ్లే వాహనదారులు ఇతర మార్గం గుండా వెళ్లాలని గ్రామస్తులు సూచించారు. అదే విధంగా ఎగువ ప్రాంతంలో కురిసిన వర్షాలకు నంగునూరు మండలం గుండా ప్రవహించే మోయతుమ్మెద వాగు ఖాత వద్ద నిర్మించిన చెక్‌డ్యామ్ నిండి పొంగి ప్రవహిస్తోంది. దీంతో అక్కేపల్లి వద్ద ఉన్న చెక్‌డ్యామ్‌లోకి నీరు భారీగా చేరుతోంది.

దుర్గమ్మ ఆలయంలో ఎమ్మెల్సీ పూజలు

జగదేవ్‌పూర్(గజ్వేల్): మండల కేంద్రమైన జగదేవ్‌పూర్ మదనదుర్గమ్మ ఆలయంలో గురువారం ఎమ్మెల్సీ యాదవరెడ్డి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ నిర్వాహకులు ఎమ్మెల్సీకి ఘనంగా స్వాగతం పలికి శాలువాలు కప్పి సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆలయ అభివృద్ధికి కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో డీసీసీబీ డైరెక్టర్ అంజిరెడ్డి, ఆత్మ చైర్మన్ రంగారెడ్డి, కొండపోచమ్మ డైరెక్టర్ కనకయ్య పాల్గొన్నారు.

బాబు జగ్జీవన్‌రామ్ సేవలు మరువలేనివి



చేర్యాల(సిద్దిపేట): చేర్యాలలో..



గజ్వేల్‌లో నివాళులర్పిస్తున్న ప్రజాప్రతినిధులు



దుబ్బాకలో..

జిల్లా వ్యాప్తంగా గురువారం మాజీ ఉప ప్రధాని డాక్టర్ బాబు జగ్జీవన్‌రామ్ వర్ధంతిని పురస్కరించుకొని అధికారులు, ప్రజాప్రతినిధులు, వివిధ పార్టీల నాయకులు ఆయన చిత్రపటాలకు, విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. స్వాతంత్ర్య సమరయోధుడు, సంఘ సంస్కర్త జగ్జీవన్‌రామ్ వివిధ పదవులతో పాటు దేశ ఉప ప్రధానిగా ప్రజలకు అందించిన సేవలు ఎనలేనివని పలువురు కొనియాడారు. సామాజిక సమానత్వం కోసం తన జీవితకాలం పోరాటం చేసిన సంస్కరణ శీలిగా చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోయిన గొప్పవ్యక్తి అని పేర్కొన్నారు.

పోచమ్మ ఆలయంలో ఎమ్మెల్యే పూజలు

దుబ్బాకరూరల్: అక్బర్‌పేట-భూంపల్లి మండలంలోని బొప్పాపూర్ గ్రామంలో పోచమ్మ ఉత్సవాలు ఘనంగా కొనసాగుతున్నాయి. ఈ ఉత్సవాల్లో గురువారం ఎమ్మెల్యే రఘునందన్‌రావు పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ప్రజలందరూ సుఖ సంతోషాలతో ఉండాలని, వర్షాలు సంమృద్ధిగా కురిసి పంటలు బాగా పండాలని అమ్మవారిని వేడుకున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేను ఆలయ కమిటీ సభ్యులు సన్మానించారు.

సంక్షిప్త వార్తలు

◆ **వేంకటేశ్వరస్వామి సేవలో భజన మండలి సభ్యులు**

హుస్నాబాద్: తిరుమల తిరుపతి దేవస్థానం పిలుపు మేరకు హుస్నాబాద్ పట్టణానికి చెందిన పద్మావతి భజన మండలి సభ్యులు గురువారం వేంకటేశ్వరస్వామి సేవలో తరించిపోయారు. తిరుమలలోని అఖండ హరినామస్మరణ మండపంలో మండలి సభ్యులు భజనలు, స్వామి కీర్తనలు ఆలపించారు. కార్యక్రమంలో భజన మండలి అధ్యక్షురాలు మాశెట్టి రాణి, లక్ష్మి, సరిత, జ్యోతి, లక్ష్మి, పద్మ, విజయ, రమ, శోభ, మహేందర్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

◆ **ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ వేడుకలను విజయవంతం చేయాలి**

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): ఎమ్మార్పీఎస్ 29వ ఆవిర్భావ వేడుకలను శుక్రవారం ఘనంగా నిర్వహిద్దామని జిల్లా కో-ఆర్డినేటర్ లింగంపల్లి శ్రీనివాస్ మాదిగ అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో లింగంపల్లి శ్రీనివాస్ మాట్లాడుతూ.. జిల్లా కేంద్రంలో నిర్వహించే వేడుకల్లో మాదిగ, ఉపకులాల ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలన్నారు.

◆ **ఆర్థికసాయం**

కొండపాక(గజ్వేల్): మండల కేంద్రమైన కొండపాకలో నిరుపేద కుటుంబ యజమాని బైరోజు ఉప్పలయ్య గురువారం మృతి చెందాడు. దీంతో డీసీసీబీ చైర్మన్ చిట్టి దేవేందర్‌రెడ్డి, జాగృతీ గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షుడు అనంతుల ప్రశాంత్‌లు వేర్వేరుగా పరామర్శించి, రూ.10వేల చొప్పున ఆర్థికసాయం అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్‌ల ఫోరం మండల అధ్యక్షురాలు చిట్టి మాధురీరెడ్డి, ఎంపీటీసీలు మంచాల అనసూయ, ఆరుట్ల లక్ష్మి, నాయకులు రామకృష్ణారెడ్డి, దొమ్మాట మహిపాల్‌రెడ్డి, బలిజ రవి, కనకరాంలు పాల్గొన్నారు.

◆ **ప్రజల్లో మరింత మార్పు రావాలి**

సిద్దిపేటజోన్: పట్టణం స్వచ్ఛ మున్సిపాలిటీగా మారిందని, పట్టణ ప్రజల్లో మరింత మార్పు రావాలని మున్సిపల్ మాజీ చైర్మన్ రాజనర్సు అన్నారు. గురువారం మున్సిపల్ అధికారులు, ప్రజాప్రతినిధులు 10వ వార్డులో ఇంటింటికీ పాదయాత్ర నిర్వహించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ సంపత్, వైస్ చైర్మన్ కనకరాజు, కౌన్సిలర్లు సుందర్, వినోభ, సాయి, అరవింద్, లక్ష్మణ్, విజయేందర్ పాల్గొన్నారు.

◆ **ఎల్లమ్మ ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్‌గా లక్ష్మీనారాయణగౌడ్**

హుస్నాబాద్: పట్టణంలోని రేణుకా ఎల్లమ్మ ఆలయ ధర్మకర్తల మండలి సభ్యుల ప్రమాణ స్వీకారం శుక్రవారం నిర్వహించనున్నట్లు ఆలయ కార్యనిర్వాహణ అధికారి విశ్వనాథశర్మ గురువారం తెలిపారు. ఈ ప్రమాణ స్వీకార మహోత్సవానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే సతీశ్‌కుమార్ హాజరవుతున్నట్లు తెలిపారు. ఆలయ కమిటీ చైర్మన్‌గా పూదరి లక్ష్మినారాయణగౌడ్, ధర్మకర్తల మండలి సభ్యులుగా పున్న సమ్మయ్య, పచ్చిమట్ల స్వప్న, లక్ష్మయ్య, నమిలికొండ రాజయ్య, పూదరి చంద్రమౌళి, తాటికొండ పరమేశ్వర్ ఎక్స్అఫిషీయో మెంబర్‌గా ప్రమాణస్వీకారం చేయనున్నట్లు విశ్వనాథశర్మ తెలిపారు.

◆ **చేర్యాల రెవెన్యూ డివిజన్ జేఏసీ గ్రామ కన్వీనర్‌గా అశోక్‌గౌడ్**

కొమురవెల్లి(సిద్దిపేట): చేర్యాల రెవెన్యూ డివిజన్ సాధన సమితి కన్వీనర్ రాములుచారి ఆధ్వర్యంలో మండలంలోని గురువన్నపేటలో గ్రామ కమిటీని ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా బుడిగే అశోక్‌గౌడ్‌ను కన్వీనర్‌గా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో అఖిల పక్ష నాయకులు గురువయ్యగౌడ్, సత్తిరెడ్డి, అయిలేనిగౌడ్, బ్రహ్మండ్లపల్లి బాబు, చెరుకు రమణారెడ్డి, కొండల్, బాలమల్లు పాల్గొన్నారు.

◆ **ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన బోధన**

కొండపాక(గజ్వేల్): ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన బోధన అందుతుందని సర్పంచ్‌ల ఫోరం జిల్లా అధ్యక్షుడు ఆరెపల్లి మహాదేవ్‌గౌడ్ ఆశాభావం వ్యక్తం చేశారు. మండల పరిధిలోని దుద్దెడ హైస్కూల్లో ఇద్దరు విద్యార్థులు పవన్‌కల్యాణ్, అజయ్ కుమార్‌లు బాసరలోని ట్రిపుల్ ఐటీలో సీటు సాధించడంతో గురువారం ఉపాధ్యాయులతో కలిసి శాలువా, మెమోంటోతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో హెచ్ఎం లక్ష్మి, ఉపాధ్యాయులు పద్మారెడ్డి, రజనీ, చంద్రభాను, యాదగిరి, ఏసుమణి, భారతి, ఉమారాణి తదితరులు పాల్గొన్నారు.

◆ **అసమర్థ పాలనలో అవస్థలు**

చిన్నకోడూరు(సిద్దిపేట): రాష్ట్రంలో ప్రభుత్వ అసమర్థ పాలనలో ప్రజలు అవస్థలు పడుతున్నారని కాంగ్రెస్ నాయకులు మామిడ్యాల శ్రీనివాస్, డీసీసీ కార్యదర్శి మీసం నాగరాజులు అన్నారు. గురువారం వారు విలేకరులతో మాట్లాడుతూ.. బీఆర్ఎస్ తొమ్మిదేళ్ల పాలనలో విద్య, వైద్యం, వ్యవసాయం తదితర రంగాలను నిర్వీర్యం చేసిందన్నారు. కాంగ్రెస్‌తోనే అన్ని వర్గాలకు న్యాయం జరుగుతుందన్నారు.

◆ **లయన్స్ క్లబ్ సేవలు అభినందనీయం**

గజ్వేల్‌రూరల్: లయన్స్ క్లబ్ ఆఫ్ గజ్వేల్ స్నేహ ఆధ్వర్యంలో చేపడుతున్న సేవా కార్యక్రమాలు అభినందనీయమని గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మున్సిపల్ చైర్మన్ ఎన్‌సీ రాజమౌళి పేర్కొన్నారు. పట్టణంలోని ప్రభుత్వాస్పత్రి ఆవరణలో కొనసాగుతున్న అల్పాహార పంపిణీ కార్యక్రమంలో గురువారం ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రెండేళ్లుగా లయన్స్ క్లబ్ ఆఫ్ గజ్వేల్ స్నేహ ఆధ్వర్యంలో పూర్వ అధ్యక్షులు గోలి సంతోష్, సయ్యద్ మతిన్‌ల పర్యవేక్షణలో అల్పాహారం అందించడంపై వారిని అభినందించారు. కార్యక్రమంలో కౌన్సిలర్ మెట్టయ్య, నాయకులు దుర్గాప్రసాద్, హైదర్‌పటేల్, లయన్స్ క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

◆ **అసిస్టెంట్ కుక్‌కు దరఖాస్తులు**

మిరుదొడ్డి(దుబ్బాక): మండల కేంద్రమైన మిరుదొడ్డిలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో ఖాళీగా ఉన్న అసిస్టెంట్ కుక్ పోస్టుకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు స్పెషల్ ఆఫీసర్ స్వర్ణలత తెలిపారు. ఆమె మాట్లాడుతూ.. కనీసం ఏడో తరగతి పాసై, కుకింగ్‌లో అనుభవం ఉండాన్నారు. ఆసక్తి కలిగిన వారు 7 నుంచి 10వ తారీఖులోగా దరఖాస్తులు అందజేయాలని కోరారు.

◆ **క్రీడా పాఠశాల ప్రవేశాలకు ఎంపిక**

మద్దూరు(హుస్నాబాద్): క్రీడా ప్రాధికార సంస్థ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ప్రాంతీయ క్రీడా పాఠశాలల్లో ప్రవేశాల కోసం గురువారం మద్దూరు మండల కేంద్రంలోని మోడల్ స్కూల్‌లో విద్యార్థులను ఎంపిక చేసినట్లు మండల విద్యాశాఖ అధికారి మొగ్గుళ్ల నర్సింహారెడ్డి అన్నారు. ఎంపిక కోసం రెండు మండలాల నుంచి 20 మంది విద్యార్థులు హాజరుకాగా అందులో నుంచి ఏడుగురు విద్యార్థులను ఎంపిక చేశామన్నారు. మండల స్థాయిలో ప్రతిభ కనబర్చిన వారు ఈ నెల 15 నుంచి 19 వరకు సిద్దిపేటలో జరిగే జిల్లాస్థాయి ఎంపికలకు పంపిస్తామన్నారు. కార్యక్రమంలో పీఈటీలు మహ్మద్ ఇంతియాజ్ హుస్సేన్, ప్రేమ్‌కుమార్ పాల్గొన్నారు.